




# నా గుండా... ఎంత పని చేశావు

డాక్టర్. ఎ.పి.విఠల్



**1974**లో సూర్యాపేటలో కల్తీ కల్లు వెయ్యిమంది వరకూ తాగగా వందమంది వరకూ మరణించి వుంటారు. పూర్తి అంధత్వం దగ్గర నుండి తరతమ స్థాయిలలో మరో వందమందికి పైగా చూపు కోల్పోయి వుంటారు. అంతకు ముందు యేడాది నుంచి రామచంద్రయ్యగారితో డాక్టర్ – రోగి మధ్య సంబంధం వున్నప్పటికీ – పై సందర్భంగా ఆ సంబంధంలో కొంచెం చనువు అదనంగా పెరిగింది. ఆయన, ఆయన అత్తగారూ – ఆరోజు కల్తీ కల్లు తెప్పించుకుని, లోకాభిరామాయణం మాట్లాడుకుంటూ, ఆ కల్లు సేవించారట. ఆ తెల్లవారుఝామునే మా హాస్పిటల్‌లో ఇద్దర్నీ చేర్పించారు. ఆరోజుల్లో బంధువులెవరైనా యింటికి వస్తే వారికి కాఫీ యిచ్చినట్టు కల్లు యివ్వడం మర్యాద! పైగా కల్లు తాగడం సర్వసాధారణం! పసిపిల్లలకు సైతం నిర్భయంగా కల్లు పట్టిస్తుండేవాళ్లు. మూడు రోజులు హాస్పిటల్‌లో వుండి స్వస్థత చెంది వెళ్లారు.

ఆ తర్వాత ఒకసారి రామచంద్రయ్య గారు, మాటల సందర్భంలో ''మీ దాకా వచ్చే వుంటుందనుకోండి... ఆ కల్తీకల్లు వ్యవహారంలో మన ఆస్పిటల్‌కు శానా మంచిపేరొచ్చింది. మిమ్మల్ని గొట్టిన డాట్టరు ఈ సుట్టుపక్కల లేరంటున్నారు. మీ హస్తవాసి అలాంటిది'' అని అన్నారు.

''ఏమీ ప్రత్యేకించి, గొప్ప వైద్యం చేయలేదండీ. అయితే, ఆ వైద్యాన్నే సక్రమంగా, ఒక పద్ధతి ప్రకారం, సకాలంలో అందించగలిగాము. నిజానికి, అలా చేయడంలో నాతోపాటు మా స్టాఫ్, గత యేడాది, మరీ ఇంజక్షన్ యిచ్చే వాళ్ళు కూడా లేని గ్రామాలలో, ఒక పదిహేనుమందికి కాస్త చదువుకున్న యువతీ యువకులకు శిక్షణ యిచ్చాము గదా. వాళ్లందర్నీ పిలిపించాను. వాళ్లూ – మెడికల్ షాపు సత్యం, షాపు సిబ్బంది, అన్నింటికీ మించి, ధైర్యంగా రోగుల వద్ద వుండి, చెప్పినట్లు సహకరించిన రోగుల బంధువులు. ఇలా అందరి సహకారమూ, కృషీ వున్నదండీ'' అని, ''మరో విషయం చెప్పనా, ఆయుషు వున్న పేషంటు అదృష్టవంతుడైన డాక్టర్ వద్దకు వస్తాడంటారు. బహుశా అదీ జరిగి వుండవచ్చు'' అన్నాను.

రామచంద్రయ్య గారు బిగ్గరగా నవ్వుతూ ''అంతేలెండి – ఎవుడికి ఈ బూమ్మీద ఎన్ని నూకలున్నయ్యో – అన్నాళ్లుంటాడు. అయి అయిపోతే, అంతే సంగతులు'' అన్నారు.

''అందుకే మీలాంటి స్థూలకాయులు షుగరు, బి.పి. వగైరా వున్నవాళ్లు – నూకలు తొందరగా అయిపోకుండా, కొంచెం కొంచెం తింటూ మితాహారం తీసుకోమని చెప్పేది. అప్పుడు 'నూకలు' చాలాకాలం వస్తాయి..'' ఆయనకు ఎప్పుడూ చెప్తున్న మితాహారం విషయంలో ఒక చురక అంటించాను.

ఆ పిదప కొన్నాళ్ళకు రామచంద్రయ్యగారు, తన కుమార్తె వివాహ ఆహ్వానం తీసుకుని హాస్పిటల్‌కు వచ్చాడు. హాస్పిటల్ స్టాఫ్ అందరికీ స్వీట్లు పంచారు.

''ఇక ఆ పిల్ల మెళ్ళో మూడు ముళ్లూ పడి, దాని నెత్తిన ఈ నాలుగు బియ్యపిత్తులూ పడితే నా బాధ్యతలన్నీ తీరిపోయినట్టేనండి. మగోళ్లు యిద్దరూ తమ తమ వ్యాపారాలు చూసుకోగల సమర్థులైనారు. ఈ బరువు కూడా దిగిపోతే...'' అని ఆయన అంటుండగా ''మళ్ళీ ఈ పెళ్లి హడావిడిలో మీరు పరీక్ష చేయించుకోవడం కుదరదేమో. ఒకసారి బి.పి, షుగర్ చూద్దాం'' అన్నాను.

బి.పి, షుగర్ రెండూ యెక్కువగానే వున్నాయి. ''ఏమిటి మందులు సరిగా వాడడంలేదా. పత్యం సరిగా చేయడంలేదా?'' అని అడిగాను.

''మందులు సరిగానే వాడుతున్నాను. ఎప్పుడైనా గుర్తులేకపోతే తప్ప...''

అయితే పత్యం, ఆహార నియమాలు పాటించడం లేదన్నమాట'' అన్నాను.

''ఎక్కడ యీలవుద్దండీ ... సంబంధం కుదుర్చుకోవడం, నిచ్చితార్థం ఈ పనులలో తిరుగుడే సరిపోయింది...'' అన్నారు రామచంద్రయ్య గారు.

''అట్లా అంటే ఒఎట్లా – వీలు చేసుకోవాలి. మీ ఆరోగ్యం పట్ల మీరు శ్రద్ధ చూపకపోతే ఎట్లా?'' అన్నాను మందలింపుగా.

''డాక్టరు గారూ – యేమీ అనుకోనంటే చెబుతాను. నిజానికి ఇంట్లో వున్నప్పుడు కూడా పత్యం చేయడం నావల్ల కావడం లేదండీ... షుగర్ వున్నదని – పంచదార, స్వీట్లు చివరికి నాకు శానాయిష్టమయిన ద్రాక్ష, సపోటా పండ్లను కూడా తినకూడదంటిరి. బి.పి. వున్నదని – ఉప్పు వాడొద్దంటిరి. అంతకుముందే గ్యాస్ట్రబుల్ గనుక కారమూ, పులుపూ, మసాలాలూ మానమంటిరి'' అని కొంచెం చిరాకుపడుతూనే, ''డాక్టరు గారూ – పెరుగు తినవచ్చునా'' అని అడిగారు.

''ఆ శుభ్రంగా తినొచ్చు. కాకపోతే, మీగడ తీసేసి పెరుగు వాడుకోవచ్చు''

''కోడిగుడ్డు''

''ఆc వుడకబెట్టుకుని, పసుపుసొన తీసేసి తినండి'' అన్నాడు.

రామచంద్రయ్యగారు ఇక నిగ్రహించుకోలేకపోయారు.

''ఇంక యేంటండి తినేది, గెడ్డి. ఇంతకాడికి ఊకే పస్తుండమని చెప్పరాదండి. కారం, ఉప్పు, పులుపు, మసాలా, తీపి, మీగడ, కోడిగుడ్డు.. యేమీ తినకుండా ఇంకేముందండీ తినేందుకు!'' అని తమాయించుకుంటున్నారు.

''ఏం చేద్దాం చెప్పండి. మిమ్మల్ని యీవిధంగా పత్యంతో యిబ్బందిపెడితే నాకు సంతోషమా? అసలే షుగరు, బి.పి. వున్నవాళ్లు, కొవ్వు పదార్థాలు అదే మీగడ, కోడిగుడ్డులో పచ్చసొన తింటే రక్తనాళాల్లో కొవ్వు పేరుకుని – ఆ తర్వాత గుండెజబ్బు కూడా రావచ్చు...'' అని నేను పూర్తి చేయకుండానే.


''నిజమే, మాకోసమే, మా ఆరోగ్గెం కోసమే చెప్తున్నారు మీరు. కానీ మీరు చెప్పినవన్నీ పాటించడమే కష్టంగా వుంటున్నది. ఈ జబ్బు సంగతి సరేగానీ, మీరు మాత్తరం అమ్మాయినీ, సెల్లెలుగార్ని తీసుకుని పెళ్లికి తప్పక రావాలి! ఆస్పటల్ పటాలం పటాలం కదలాలి'' అని పదిహేను రోజులకు మందులు రాయించుకుని ''ఇకనుంచి జాగర్తగానే వాడుతానండీ'' అంటూ వెళ్లారు.

నేను యింటికి వెళ్లేసరికి – ఒక స్టీలు పళ్లెంలో శుభలేఖతోపాటు ఒక పట్టుచీర, రవిక, మా అమ్మాయికి పట్టు పరికిణీ, జాకెట్టు – నాకు రేమాండ్ రెడీమేడ్ దుస్తులూ వున్నాయి. రామచంద్రయ్యగారితో, నేనక్కడ వున్నంతవరకూ మాట్లాడుకోని అగ్రిమెంటు ఒకటి వున్నది. ఆయనకూ, ఆయన కుటుంబ సభ్యులకు యే పరీక్ష ఫీజు తీసుకోకుండా వైద్యం చేస్తాను. మందులు, అవీ ఆయన కొనుక్కుంటారు. ప్రతి దసరాకు, సంక్రాంతికి మా ఇంట్లో మా ముగ్గురికి రెండేసి జతలు బట్టలు ఆయన కుట్టించి పంపుతుంటారు. ఆరోజుల్లో చిన్న చిన్న పట్టణాలలో యిలాంటి అగ్రిమెంట్లు డాక్టరుకు పేషంటుకు మధ్య వుండేవి. ప్రతాపరెడ్డిగారు పక్కగ్రామంలో ధనిక రైతు. ఆయన కూడా ఇలాగే.. ప్రతినెలా పాతిక కేజీలు ఒక పట్టు తక్కువ పట్టిన పాతబియ్యం ఇంటికి పంపేవారు. ఆయన, ఆయన తల్లిదండ్రులు, భార్యాపిల్లలు – వీళ్ల వద్ద ప్రత్యేకించి ఫీజు తీసుకోకుండా వైద్యం చేసేవాడిని.

''ఏమిటీ మూడు నెలలయింది, మళ్లీ పరీక్ష చేయించుకునేందుకు రాక?'' అని అడిగాను.

''ఏదండీ. పెళ్లి హడావుడి – ఆ తర్వాత కార్యక్రమాలు. ఇంతలో మగపిల్లలిద్దరికీ కూడా. ఆళ్ల ఆస్తులు ఆల్లకు పంపకం చేద్దామనిపించింది. ఆ యవ్వారం అదీ పూర్తి చేయడం – హడావిడి! పొద్దుగాలే, యేమీ తినకుండా వచ్చి రక్తం పరీక్షకిచ్చి వచ్చాను. మీకాడికి రాబోయే ముందే, ఇదుగో ఆ రక్తపరీక్ష చీటీ'' అంటూ యిచ్చాడాయన.

షుగర్ ఎక్కువగా వుంది. బి.పి. కూడా. ''ఈ యాల్టి నుంచి పదేను రోజులపాటు యాత్రా స్పెషల్ బస్సులో మా అమ్మా, అయ్యా ఇద్దరూ ఒక మనిషిని తోడు తీసుకుని బయలెల్తున్నారు. ఆ యేర్పాట్లు అవీ చేసి, రాత్రి బోజనాలయినంక వాళ్లని బస్సెక్కించి, నడిస్తే మంచిది కదా అన్నారని





## మరో ప్రేమకథ...

కల్పన లజ్మి చింగారి ఒక సంచలనం కావొచ్చేమో. (ఎందుకంటే హంగామా అలా వుంది మరి.) దీనికి మొదటగా పోస్ట్‌మాన్ అండ్ ది ప్రాస్టిట్యూట్ అని పేరు పెట్టి ఆ తర్వాత చింగారిగా మార్చారు. సినిమా పేరు చిన్నచిన్న గ్రామప్రజలకు కూడా అర్థమవ్వాలనిట. అలా అని ఇదేదో సమాజస్పృహగల సినిమా అని ఎక్కడ అపోహలు పెంచేసుకుంటారేమో అని ముందుగానే చెప్తోంది కల్పన 'చింగారికి అభిమాని అయిపోయి సమాజాన్ని పాడుచేయకండి. విద్యను వివేకాన్ని సాధించే ఒక ఆయుధంగా వాడుకోండి' అంటూ ప్రచారం సాగించింది. కథ చాలా అసామాన్యంగా వుంటుందని ఇందులో ఉత్తరాది వారి సంస్కృతీ సాంప్రదాయాలు గుబాళింపులుంటాయని ఊరిస్తోంది. ఇక శృంగారం పాలు బాగానే వుంటాయని స్టిల్స్ చెప్పనే చెప్తున్నాయి. ఈ ఫిల్మ్‌లో సుస్మితాసేన్ ఒక శక్తివంతమైన పాత్రని పోషిస్తోందట.. ఏమిటని అడగొద్దు. సస్పెన్స్ అంటోంది కల్పన..

నడిచి, యింటికెళ్తుంటే కొంచెం ఛాతిలో నొప్పి అనిపించింది. కాసేపు అక్కడే మొరిసెట్టి వారి అరుగు మీద కూర్చున్నాను. తగ్గిపోయిందిలెండి'' అన్నాడాయన.

అది తేలిగ్గా తీసిపారేసే ఛాతినొప్పి కాదనిపించింది. అప్పుడే ఆ విషయం చెప్పకుండా ''అది సరేగానీ, ఆ కల్తీ కల్లు వ్యవహారం తర్వాత మందు మానేశారు గదా!'' అని అడిగాను.

రామచంద్రయ్యగారు ''మానేశాను అని అబద్ధం ఆడలేనుగానీ శానావరకూ తగ్గించానండి'' అన్నారు.

''ఏమిటి? ఇంత జరిగిన తర్వాత కూడా మళ్లీ..'' అని నా మాట పూర్తిగాకుండానే –

''డాట్టర్ సాబ్! మన సర్కారు గోడౌన్లలో వందల బస్తాల బియ్యం వుంచారు. పురుగులు పడకుండా ఆటిమీద గెమాక్సిన్ చల్లుతున్నారు. పొరపాటున ఆ గెమాక్సిన్ కొంచెం బియ్యంలో కలిసి, ఆ బియ్యం అన్నం తిన్నవాడు సచ్చాడనుకుందాం. అందుకని అన్నం మానేస్తామండీ! ఏదో పొరపాటునో, గ్రహపాటునో ఆ కల్తీసారి వుపద్రవం జరిగింది. అట్టాంటి వుపద్రవాలు రోజూ జరుగుతయ్యా..'' అన్నారాయన.

''ఏమిటండీ... ఈ వితండవాదం? బి.పి, షుగరు, ఛాతినొప్పి, గ్యాసు – దీనికితోడు సిగరెట్టు – మందు... ఏ పత్యమూ చెయ్యరు. పైగా యెప్పుడూ ఏదో పరుగు పందెం వున్నట్టు – క్షణం తీరిక వుండదు. ఎట్లా యిట్లా అయితే'' అని కొంచెం గట్టిగానే మందలించాను.

''నాలాంటి పేషెంటుతో మీలాంటి డాట్టర్లకు సిక్కేననుకోండి. ఇయ్యేయీ లేకపోతే మరో అయిదారేళ్లు అదనంగా బతుకుతాను. అసలు యెప్పటికైనా పోయేది పోయేదేగదా! అయినా ఇట్టా ఏమీ తినకుండా, ఏమీ తాగకుండా, ఏ ఆలోచనలూ పెట్టుకోకుండా... సన్నాసిలాగే బతకడం, యేధైనా గుట్టల్లోనో, అడివిలోనో సరిపోద్దేమో గానండీ... మడుసుల మద్దెన కుదరదు. అన్నట్టు ఆయనెవరో కమ్యూనిస్టు నాయకుడు – పేరు గుర్తులేదు. ఆయన ఒకసారి యిమానంలో ఎల్తుంటే ఒక యిమానపమ్మాయి వచ్చి సిగరెట్టు యియ్యబోయిందట! ఈయన నేనెప్పుడూ పొగ తాగనన్నాడంట! ఆ తర్వాత కాపీ యియ్యబోతే – కాఫీ, టీ, డ్రింకులు, ఇట్టాంటివి తాగను – పాలైతే కొంచెం తాగుతానన్నాడట. భోజనం తీసుకురాబోతే – మాంసం, సేపలు, గుడ్లు యేమీ వద్దు. ఆకుకూరలు, కాయగూరలు మాత్తరం తెమ్మన్నాడంట. ఆ యమ్మాయి – ఆయనను యెగాదిగా జూసి, 'మీకు పెళ్లయిందా సారూ' అని అడిగిందట. 'పెళ్లి చేసుకోలేదు' అని చెప్పాడంట. అందుకా అమ్మాయి ఆచ్చర్యంగా 'అయితే తమరు యెందుకు బతుకుతున్నట్టు?' అని శరశరా యెళ్లిందట'' అని చెప్పి గలగలా బిగ్గరగా నవ్వాడాయన.

''సరేలెండి. అయితే – ఆ కమ్యూనిస్టు నాయకుడు, ప్రజలందరూ కనీస జీవిత అవసరాలు తీర్చుకుని, గౌరవంగా బతికే సమాజం రావాలని, అందుకోసం కృషిచేయాలని, అందుకు తగిన ఆయురారోగ్యాలకోసం బతుకుతున్నానమ్మా అని చెప్పివుండాల్సింది'' అన్నాను.

''అలాంటి మగానుబావులం అందరం కాలేము కదండీ.... నిన్ననే పేపర్లో చూశాను – మనదేశంలో సగటు మడిసి ఆయుస్సు యాభై అయిదేళ్లంట! నాకు యాభై యేడు ఇప్పటికే వోడివో రెండేళ్లు మింగేసి బతుకుతున్నాను'' అన్నాడు.

''ఈ వేదాంతానికేమొచ్చెగానీ, రామచంద్రయ్య గారూ – మీరు ఒకసారి హైదరాబాద్‌లో పి.యస్. రావుగారని, నాకు తెలిసిన గుండె డాక్టరున్నారు. ఆయనకు ఉత్తరం రాసిస్తాను. ఒకసారి వెళ్లి ఆయనతో పరీక్ష చేయించుకోండి. ఎందుకైనా మంచిది'' అన్నాను ఆయనకు మందులు రాసిస్తూ.

''ఎవురికి మంచిది? నాకా, ఆ డాక్టరు గారికా? అవన్నీ యిప్పుడు కుదరవుగానీ, ముందు మందు రాసివ్వండి. మీకంటే లావోటోడా ఆ డాక్టరు?''

''నిజంగా ఆయన గుండెవైద్యంలో నిపుణులు. ఆ విషయంలో మంచి డాక్టరు. ఒకసారి వెళ్లండి'' అంటూ నేను రాసిన మందుల చీటి యిచ్చాను.

''మళ్లీ కలుస్తా డాక్టరుగారూ. మీరు చెప్పినయన్నీ యిన్నాను. అయన్నీ చేయగలిగితే మడిసెట్లా అవుతాడండీ – దేవుడు గాదూ'' అని స్టూలు మీదనుండి లేస్తుండగా, బయట ఓ.పి.లో పెద్ద హడావుడి, యేడుపులూ, పెడబొబ్బలూ – నానూ, నాతోపాటు రామచంద్రయ్య గారూ బయటికి వచ్చాం.

''అయ్యా, డాట్టర్ సాబ్. సూడయ్యా... నాగయ్య యేం జేసిండో'' అంటూ నాగయ్య తండ్రి ఎనభై సంవత్సరాల వృద్ధుడు కాళ్లు చుట్టేస్తున్నాడు.

''ఉండు, ముందు పేషెంటును చూడనియ్'' అంటుండగా, నాగయ్యను ట్రాక్టరు మీద నుంచి దింపి చేతుల మీద మోసుకొచ్చి ఒక బల్లమీద పడుకోబెట్టారు. నేను వెళ్లి చూసేసరికే శ్వాస లేదు. కృత్రిమ శ్వాస తెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. కాంపౌండర్ రాములు చుట్టూ మూగిన జనాన్ని తోసేసి – నాకు సాయంగా వచ్చి నిలబడ్డాడు. పది నిముషాలు ప్రయత్నించాను. కానీ ప్రయోజనం లేకపోయింది.

''ప్చ్– లాభం లేదు'' అంటూ లేచి నిలబడ్డాను.

''ఏంది?'' నాగయ్య తండ్రి అయోమయంగా చూస్తూ అన్నాడు.

''ఇంకేముంది. అంతా అయిపోయింది. పానం పోయింది'' అన్నాడు రాములు.

''ఏందీ పానం పోయిందా?.. యాడకి పోయింది? ఎట్లా పోయింది?'' అంటూ ఆ మాటలు నమ్మకుండా ''అయ్యా నాగులూ –

నాగులూ!'' అంటూ చనిపోయిన కొడుకు తల అటూయిటూ తిప్పుతూ - ''ఏందిరా నాగులూ, ముసలి వగ్గులం మేం బతికుండగా నువెల్లిపోవడమేందిరా నాగులూ, ఇదెక్కడి దరమం'' అని యేడుస్తూ రామచంద్రయ్య గార్ని చూసి ''సూడు రామచంద్రయ్యా.... నీ సావాసగాడు మా నాగులు యేం జేసిండో. ఈడి పాఁర చూసేందుకే మాకీ ఆయుసుంది గామాల'' అంటూ రామచంద్రయ్య గారిని చుట్టేశాడు. ఆయన ''వూరుకో పెద్దయ్యా... పెద్దోడివి.. మడుసులం. యేం జేయగలం... వూరుకో'' అంటూ వోదార్చే యత్నం జేస్తున్నారు.

''నాగన్నా... ఇంత కటినాత్ముడవైనవేందిరా! మీ అయ్యా - నేనూ, నీ సంసారాన్ని జూసుకుని గదరా బతుకుతున్నది! మునిమనవడ్ని మాకు సూపించి, మురిపించావుగాని, యింతలో యిట్టా మమ్మల్ని అనాదుల్ని సేసిపోయావేందిరా అయ్యా! కల్లోగూడా అనుకోలేదురా అయ్యా.. యిట్టా అవుద్దని! నిరుడు యాసంకాలం వడగొట్టినప్పుడు పోనయినా పోకపోతిని గదరా అయ్యా - రేత్తిరి నిద్దరలో యేయేలప్పుడు లేసినా, మాకాడికొచ్చి - మమ్మల్ని జూసి పోతుండేవాడివి గదరా! అమ్మా పొలమెల్లొత్తానే అని జెప్పకుండా పొలానికి పోయేవాడివి గాదుగదరా! కనికరం లేకుండా, సెప్పాపెట్టకుండా, మమ్మల్ని అమాస చీకటిలో ముంచి, యేడకి బోయినవురా కొడకా!'' అంటూ నాగయ్య తల్లి నెత్తి నోరు బాదుకుంటూ, గుండెలవిసేలా ఏడుస్తున్నది. వాళ్లిద్దర్నీ యెట్లా వోదార్చాలో తెలియడంలేదు. ఇలాంటి సమయాలలో, అందులోనూ ఆ పెద్దవాళ్లిద్దర్నీ యేమని వోదార్చగలం! అయినా నా ప్రయత్నంగా నాగయ్య తండ్రి వద్దకు వెళ్లి ''ఊరుకో, పెద్దాయనా... ఏం జేస్తాము... నీకు తెలియందేముంది?'' అంటూ ఏదో మాట్లాడబోయాను.

''నాకేం దెలస్తదయ్యా. మూర్కున్ని! మా వూరి పెద్దమర్రికీ వచ్చినయి, నాకూ వచ్చినయి ఏళ్లు... ఎందుకు? పతిరోజూ రాత్తిరిళ్లు నాకు సరిగా కానరాదని, నేను నాలుగైదుసార్లు వొంటికి పోలేనని ఒక తగరం డబ్బా దెచ్చి, మంచంకాడ బెట్టి, పొద్దగాల అయి పారబోసి వచ్చేవాడయ్యా. పొద్దుగాల పొలం యెళ్తూ- 'అయ్యా .. నేను పొలమెల్తన్నానే' అని జెప్పి పొయినాడు. పొద్దు మూడుజాములకొచ్చినా, యింకా రాలేదేందబ్బా - యీపాటికి ఇంతముద్ద తిని మళ్లీ ఎల్లేవాడు... అనుకుంటూ వున్నానయ్యా.''

నాగులు తల్లి అందుకుంది - ''నాగులు ఇంకా రాలేదు సుగునమ్మా. ఎందుకు రాలేదో ఎవుర్నయినా బంపకపోయావంటే అని కోడలితో అన్నానయ్యా! ఇంతలో నలుగురు గలిసి, నులక మంచం మీద యేసుకుని నాగుల్ని యింటికి దెచ్చారయ్యా. అట్టా సూడంగానే పైపానాలు పైనే బొయ్యాయయ్యా...'' అంటూ ఏడుస్తూ నాగులు తల్లి సొమ్మసిల్లి పడిపోయింది. మా రాములు ఆమెకేదో సపర్యలు జేయబోయాడు. ''ఇంక మా సంగతి దేనికయ్యా. పాపిస్టోల్లం. మమ్మల్ని లచ్చనంగా సాగనంపి, మా తల కొరివి పెట్టాల్సినవాడు మా కల్లముందే... యిట్టా యెల్లిపోతే, సిగ్గు యెగ్గూ లేకుండా యింకా పానాలతో బతికన్నాం - థూ? మా బతుకు తగలడ - నాగులూ - నాగులూ - నాగులూ... మాలాంటి బతుకు, కుక్కకూ వద్దు - భగమంతుడా! ఇదే నాయమయ్యా...'' అంటూ నాగులు తండ్రి యేడుస్తుంటే ఇక అక్కడ వుండి చేసేదేమీ లేక, రామచంద్రయ్య గారికి చెప్పి - నా గదిలోకి వెళ్లి కూర్చుంటూ నాగయ్య శవం వంక ఒకసారి చూశాను. నాగయ్య తలమీద, తన తల ఆనించి, నాగయ్య వొళ్లు నిమురుతూ, నోట మాట లేకుండా మౌనంగా రోదిస్తున్న అతని భార్య కనిపించింది.

అదే ట్రాక్టర్‌లో నాగయ్య శవాన్ని తీసుకుని, వాళ్లందరితోకలిసి రామచంద్రయ్య గారు కూడా వాళ్ల వూరు వెళ్లారు.

పదిహేను రోజులకు రామచంద్రయ్య గారు వచ్చారు. వస్తూనే ''నాగయ్య నా కళ్లు తెరిపించాడండీ... కిందటేడే ఒకసారి ఛాతిలో నొప్పి వచ్చిందంట! ఏదో పేరు నెయ్యి రుద్దుకుని.. వూళ్లో కొట్ల దెచ్చుకుని గ్యాస్ బిళ్లలు మింగాడంట... అప్పుడే సుగుణమ్మ 'పేటకుపోయి ఒకసారి పరీచ్చ చేయించుకురా! రోజులు బాగాలేవు' అని అంటే 'ఇదేంది లేవే. మద్దాన్నం కోడి పలావ్ తిన్నాను గదా, గ్యాస్ పట్టేసింది' అని ఆమె మాట పట్టించుకోలేదంట! మళ్లీ ఒకసారి తెల్లవారుజామున గుండెనొప్పి అన్నాడంట. 'ఈసారన్నా సూపించుకో - నువ్వసలే మొండోడివి... అన్నిరోజులూ మనవిగావు' అని పోరుబెడుతుంటే - నాట్లు, మందులు జల్లుకోవడం, కోతలు, కుప్పలు నూర్పిళ్లు అంటూ నాగయ్యే తాత్సారం చేసిండంట. నాగయ్య సచ్చిపోయిన రోజునే 'ఇక పొలం పనులు అయిపొయినయి... రేపు యెల్లి సూపించుకుంటానని పొలమెళ్లాడంట. ఆడనే ఛాతి నొప్పి వచ్చి దిగచెమటలు పట్టి వాంతి చేసుకుని స్పృహలేకుండా పొలంలోనే పడిపోతే, నలుగురూ పోగయి యింటికి తీసుకొచ్చారంట. ఇక మనకు తెల్సిందేగదా!'' అన్నాడాయన విచారంగా.

నేనేం మాట్లాడలేదు.

''ఆ ముసలాల్ల గోస - నరమానవుడికి కూడా వద్దండీ డాక్టరుగారూ... నాకనిపించింది - కన్నతల్లి తండ్రినీ సుకపెట్టామో లేదోగానీ, ఆల్లకి పుత్రశోకం మాత్రం కలిగించకూడదండి. ఆల్లని మనసేతుల మీదుగా పంపించిగానీ పోగూడదని గెట్టిగా నిర్ణయించుకున్నాను. ఆ హైద్రాబాదు డాక్టరు గారికి వుత్తరం రాసియ్యండి. రేపే యెల్లి పరీక్ష చేయించుకుంటాను'' అని అన్నారు.

ఉత్తరం రాస్తూనే ''అయితే అమ్మా - నాన్నల కోసం బతకదలచుకున్నారన్నమాట!'' అన్నాను.

''బూమ్మీదకు మనల్ని తీసుకొచ్చి - పేరు, పెద్ద చేసి, మనం జేసిన జేస్తున్న పిచ్చి యెచ్చి చేష్టలన్నీ భరించి, మనల్నింతవాళ్లని జేసిన అయ్యా- అమ్మా రుణం జలమజలమలకు తీరదండీ.. ఆళ్లను సక్రమంగా సాగనంపే పోవాల'' అన్నారాయన.

''ఆ పరిధినే కొంచెం పెంచండి రామచంద్రయ్య గారూ. మీరు ఒక కమ్యూనిస్టు నాయకుడు - విమానం అమ్మాయి అని చెప్పారే, గుర్తుందా. గాంధీగారు నూట యిరవై సంవత్సరాలు బతుకుదామనుకున్నారట! నాకు తెలిసి సుందరయ్య గారు - నూరేళ్లు బతుకుదామనుకున్నారు. ఆయనకు పిల్లాజెల్లా కూడా లేరు! ప్రతి మనిషి - కూడు, గుడ్డ, నీడ, విద్య, వైద్యం యిలాంటి కనీస సదుపాయాలు పొంది, గౌరవంగా ప్రజలందరూ బ్రతకడంకోసం తాము వీలైనంత ఎక్కువ కాలం కృషి చెయ్యాలనే! ప్రజలను వాళ్లు తమ కుటుంబం అల్లే భావించారు గనుకనే'' అంటూ వుత్తరం ఆయన చేతికిచ్చాను. ''వాళ్లు మహానుభావులు'' అంటూ ఉత్తరం తీసుకుని వెళ్లారాయన! ■

